# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ జనవరి 04 శనివారం 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 171

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే ఆస్తి హక్కు రద్దు

జన్మనిచ్చిన తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ బాధ్యత వారి కుమారులు, కుమార్తెలదేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

సుప్రీంకోర్టు తీర్పు

వృద్ధుల సంరక్షణ బాధ్యత

బిడ్డలదేనని స్పష్టీకరణ



2లో



2లో

# గత పదేళ్లలో భ్రష్టుపట్టిన పరిపాలన

అధికారంలోకి రాగానే

గాడిన పెట్టాం

అప్పల కారణంగా మరిన్ని పనులు చేపట్టలేకపోతున్నాం

గెజిటెడ్ ఆఫీసర్స్ డైరీ ఆవిష్కరణలో సిఎం రేవంత్

- వీలైనంత త్వరగా ట్రిపుల్ ఆర్ భూసేకరణ
- నాగ్‌పుర్ నుంచి విజయవాడ కారిడార్‌లో త్రగా పూర్తి
- అటవీ, ఆర్ అండ్ బి అధికారులతో సమన్వయం
- రెండు శాఖల్లో ఒక్కో అధికారి నియామకం
- ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రానికి బిటి రోడ్డు
- రీజినల్ రింగ్ ర ఓడ్డుపై సమిక్షలో సిఎం రేవంత్

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం కోసం విడతల వారీగా నిధులు విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. నాగ్ పూర్-విజయవాడ కారిడార్‌కు సంబంధించి తెలంగాణ జిల్లాల్లో అసంపూర్తిగా మిగిలిన భూసేకరణ పక్రియను సంక్రాంతిలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అటవీశాఖ పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. అటవీశాఖ, ఆర్ అండ్ బీ శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని,రెండు శాఖల్లో ఒక్కో అధికారిని ఇందుకు ప్రత్యేకంగా నియమించాలని సూచించారు.



## నాకు అద్దాలమేడ లేదు: మోదీ

దిల్లీ: దేశ రాజధాని నగరంలోని దిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్మించిన పలు నివాస సముదాయాలను శుక్రవారం ప్రారంభించిన ప్రధాని మోదీ.. ఆప్ సర్కారుపై మాటల దాడికి దిగారు. "మోదీ తన కోసం అద్దాలమేడ (శీష్ మహల్) కట్టుకోలేదన్న విషయం దేశం మొత్తానికి తెలుసు. అయినప్పటికీ గత పదేళ్లలో దేశంలోని పేదల కోసం 4 కోట్ల ఇళ్లను నిర్మించి వారి కలలను సాకారం చేశాం" అని అన్నారు. మలిదశలో పట్టణ పేదలకు కోటి ఇళ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల లబ్ధిదారులకు అశోక్ విహార్ ప్రాంతంలో నిర్మించిన స్వాభిమాన్ అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్ల తాళాలను ప్రధాని అందజేశారు. ఆప్ పాలన దిల్లీకి ఆపదగా మారిందని, గత పదేళ్ల నుంచి దేశ రాజధానిని తన గుప్పిట్లోకి తీసుకొన్నవారి పాలన ఇంకా కొనసాగితే దిల్లీ పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని మోదీ అన్నారు.

ప్రసంగంలో 39 నిమిషాలు తిట్లే: కేజ్రీవాల్‌దిల్లీ ప్రగతికి కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చేయూతను అందించకపోయినా, ప్రధాని మోదీ తన 43 నిమిషాల ప్రసంగంలో 39 నిమిషాలు ప్రజలు భారీ మద్దతుతో ఎన్నుకొన్న దిల్లీ సర్కారును తిట్టడానికే కేటాయించారని ఆప్ సుప్రీం నేత అరవింద్ కేజ్రీవాల్ ఎద్దేవా చేశారు. తన కోసం రూ.2,700 కోట్ల నివాసం కట్టుకొని, రూ.10 లక్షల సూట్లు ధరించి.. రూ.8,400 కోట్ల విమానంలో విహరించే వ్యక్తి నోట 'అద్దాలమేడ' వంటి మాటలు సముచితంగా లేవన్నారు.

### ఇది ప్రజాప్రభుత్వం కాదు..
## కోతల ప్రభుత్వం



హైదరాబాద్: ఇది ప్రజా ప్రభుత్వం కాదు.. ప్రజలను మోసం చేసే ప్రభుత్వమని కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ చేతల ప్రభుత్వం కాదు మాటల ప్రభుత్వం, కోతల ప్రభుత్వమని మండిపడ్డారు. రైతు భరోసా లో కోతలు పెట్టే కుట్రలు చేస్తున్నారని ఆయన అన్నారు. రైతులు, రైతు కూలీలు, కౌలు రైతులు ఎందరు ప్రభుత్వం దగ్గర డేటా ఉందని, దద్దమ్మ ప్రభుత్వం రైతుల నుండి దరఖాస్తులు ఎందుకు అని ఆయన ప్రశ్నించారు. ఫసల్ భీమా ఊసే లేదు.. రైతు భరోసా కింద ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని కిషన్ రెడ్డి విమర్శించారు. రైతుల మీద అక్రమ కేసులు పెట్టి? రైతులకు సంకెళ్లు వేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమని, అప్పుడు బీఆర్ఎస్ రైతులకు సంకెళ్లు వేస్తే ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు వేస్తుంది సంకెళ్ళు అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రైతులకు అండగా ఉందని, నవంబర్ 30 న నాలుగో విడత రుణమాఫీ చేస్తున్నట్టు రేవంత్ రెడ్డి ప్రకటించారన్నారు కిషన్ రెడ్డి. ఆ డబ్బులు

ఇంకా రైతుల అకౌంట్ లలో చేరలేదని, ఇంకా నాలుగు సంవత్సరాలు అయిన రుణమాఫీ కాదని ఆయన సెటైర్లు వేశారు. కనీస మద్దతు ధర కొన్ని పంటల మీద 80 శాతం మోడీ ప్రభుత్వం పెంచిందని, కేంద్రం అన్ని విధాలుగా సహకరిస్తున్నా.. ధాన్యం కొనుగోలు లో ఈ ప్రభుత్వం వైఫల్యం చెందింది? ఇది నేరపూరిత చర్య అని కిషన్ రెడ్డి ఆరోపించారు.

## కాంగ్రెస్, భాజపాల హయాంలోనే బీసీలకు అన్యాయం



రాంనగర్: కాంగ్రెస్, భాజపా ప్రభుత్వాల హయాంలో బీసీలకు ఎప్పుడూ అన్యాయమే జరిగిందని భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఆ రెండు జాతీయ పార్టీలూ బీసీలకు తీరని అన్యాయం చేశాయని.. ఇది అబద్ధమని నిరూపిస్తే తాను శాశ్వతంగా రాజకీయల నుంచి వైదొలుగుతానని అన్నారు. అఖిల భారత పద్మశాలి సంఘం రాజకీయ విభాగం, తెలంగాణ జాగృతి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ ఇందిరాపార్కు సమీపంలోని ధర్నాచౌక్‌లో 'బీసీ మహాసభ' నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కవిత మాట్లాడుతూ.. "బీఆర్ అంబేద్కర్ కృషితోనే ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగ ఫలాలు దక్కాయి.. అదే తరహాలో బీసీలకూ రక్షణ కల్పించాలి. కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం 'కామారెడ్డి బీసీ డిక్లరేషన్'ను వెంటనే అమలు చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. బీసీలకు కొంతమేరకైనా న్యాయం జరిగిందంటే అది ప్రాంతీయ పార్టీలతోనే.. భారాస చేపట్టిన ఉద్యమాల వల్లే సావిత్రీబాయి ఫులే జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి మాజీ ఛైర్మన్ స్వామిగౌడ్, కరీంనగర్ జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ తుల ఉమ, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, తెలంగాణ జాగృతి నేతలుబీ వివిధ కుల సంఘాల నేతలతో పాటు మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు



2లో

## తెలంగాణలో పెరిగిన చలితీవ్రత

ఆదిలాబాద్‌లో 7.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత



2లో

## ప్రజావాణికి మొత్తం 359 దరఖాస్తులు రాక

## కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు జారీ



హైదరాబాద్: ఫార్ములా ఈ-రేసింగ్ కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో ఈ నెల 6న ఉదయం పది గంటలకు విచారణకు హాజరు కావాలని ఏసీబీ నోటీసుల్లో పేర్కొంది. అంటే వచ్చే సోమవారం కేటీఆర్ విచారణకు హాజరు కావాల్సి ఉంటుంది. ఇటీవల దాన కిశోర్ ను ఏడు గంటల పాటు విచారించిన ఏసీబీ పలు వివరాలను తీసుకుంది. దాన కిశోర్ ఇచ్చిన సమాచారం ఆధారంగా దర్యాప్తును ముందుకు తీసుకువెళుతోంది. ఈ క్రమంలోనే కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది.

## మొదలైన హైదరాబాద్ ఎగ్జిబిషన్

ప్రారంభించిన మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం



హైదరాబాద్: హైదరాబాద్ నాంపల్లిలో నుమాయిష్ సందడి మొదలైంది. ఏటా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 84వ అఖిల భారత వస్తు పారిశ్రామిక ప్రదర్శనశాలను రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. 1938లో నిజాం కాలంలో మొదలైన నుమాయిష్‌కు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ నలుమూలల నుంచి సందర్శకులు వస్తారు. సందర్శకుల సౌకర్యార్థం ఎగ్జిబిషన్ సొసైటీ గాంధీభవన్, అజంతా, గోషామహల్ గేట్‌లను అందుబాటులో

మిగతా 2లో

# తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే ఆస్తి హక్కు రద్దు

దిల్లీ: జన్మనిచ్చిన తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ బాధ్యత వారి కుమారులు, కుమార్తెలదేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ బాధ్యతను విస్మరించిన వారికి కన్నవారి ఆస్తిని పొందే హక్కులేదని తేల్చి చెప్పింది. వృద్ధాప్యంలో అమ్మానాన్నల బాగోగులన్నీ చూసుకుంటానని హామీనిచ్చి, వారి నుంచి ఆస్తి పొందిన కుమారుడు మాట తప్పడంతో ఓ కన్నతల్లి న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ కేసును విచారించిన జస్టిస్ సి.టి.రవికుమార్, జస్టిస్ సంజయ్ కరోల్ ధర్మాసనం... ఆ కుమారుడికి ఇచ్చిన గిఫ్ట్ డీడ్‌ను రద్దుచేసి ఆ ఆస్తిపై వృద్ధుల హక్కును పునరుద్ధరించింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. బిడ్డల నిరాదరణకు గురయ్యే తల్లిదండ్రులకు 2007లో ప్రభుత్వం తీసుకొచ్చిన 'తల్లిదండ్రుల, వృద్ధుల సంరక్షణ, పోషణ చట్టం' అండగా నిలుస్తుందని పేర్కొంది. ఈ చట్టం ప్రకారం ఏర్పాటైన ట్రైబ్యునళ్లు... కన్నవారిని పట్టించుకోని బిడ్డల విషయంలో సత్వర విచారణ జరుపుతాయని తెలిపింది. ఇలాంటి వివాదాల్లో తల్లిదండ్రులు తమ



పిల్లలకు బదిలీ చేసిన ఆస్తిపై యాజమాన్య హక్కులు తిరిగి బాధితులకే దక్కేలా ఆదేశించే అధికారం ఆ ట్రైబ్యునళ్లకు ఉంటుందని ధర్మాసనం స్పష్టంచేసింది. తద్వారా వయోధికులకు ఆర్థికపరమైన భరోసా లభిస్తుందని పేర్కొంది.మిగిలిన ఆస్తిని కూడా ఇచ్చేయాలని కోరుతూ వృద్ధ దంపతులమైన తమపై కుమారుడు దాడి చేస్తున్నాడంటూ మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తార్‌పుర్‌కు చెందిన ఓ మహిళ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అతనికి అప్పటికే గిఫ్ట్ డీడ్‌గా కొంత ఆస్తిని ఇచ్చామని తెలిపారు. ప్రేమ, ఆప్యాయతలు కనుమరుగైన పరిస్థితుల్లో ఆ గిఫ్ట్ డీడ్‌ను రద్దుచేసి ఆస్తిపై

తమ హక్కును పునరుద్ధరించాలని ఆ వృద్ధ మహిళ వేడుకుంది. దీనిపై విచారణ జరిపిన సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్.

..గిఫ్ట్ డీడ్‌ను రద్దుచేసి వయోధికుల ఆస్తి హక్కును పునరుద్ధరించారు. హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం కూడా ఈ తీర్పును సమర్థించింది. అయితే, హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఆ తీర్పును కొట్టివేసి కుమారుడికే ఆస్తి దక్కుతుందని పేర్కొంది. బాధిత మహిళ సుప్రీంకోర్టును ఆశ్రయించగా వృద్ధ దంపతుల హక్కులను పునరుద్ధరించింది. కుమారుడికి ఇచ్చిన గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేసింది. ఫిబ్రవరి నెలాఖరులోగా వృద్ధ దంపతులకు ఆస్తిని అప్పగించాలని పేర్కొంటూ కుమారుడికి ఆదేశాలు జారీచేసింది.

# నీది నాలుకా..తాటి మట్టా

## కడియం వ్యాఖ్యలపై తాటికొండ ఆగ్రహం

**జనగామ:** నీది నాలుక తాటి మట్టా.... అన్నం తింటున్నావా గడ్డి తింటున్నావా అంటూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాటలపై మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. పది సంవత్సరాలు కేసీఆర్ కుటుంబంతో కూడి పొగిడిన వ్యక్తివి నువ్వు కాదా అని దుయ్యబట్టారు. అవకాశవాది నుంచి అవినీతి మాట రావడం సిగ్గుచేటు అని అన్నారు. కుట్రలు, కుతంత్రాలు చేస్తున్న రేవంత్ రెడ్డి సానుభూతి పొందడానికే తన ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని రాజయ్య అన్నారు. కవితను అరెస్టు చేసిన రోజు రోడ్డుపై బైఠాయించి కవితను విడుదల చేయాలని ధర్నా చేసింది నువ్వు కాదా అని ప్రశ్నించారు. నువ్వు చేసిన మోసానికి బీఆర్ఎస్ వాళ్లే కాదు.. కాంగ్రెస్ వాళ్లు కూడా తు తు అంటున్నారని తాటికొండ రాజయ్య ఆరోపించారు. ఇంకోసారి కేసీఆర్ కుటుంబం గురించి మాట్లాడితే జాగ్రత్త అని హెచ్చరించారు. నియోజకవర్గంలో 1100 మంది దళితులకు దళిత బంధు రాకుండా అడ్డుకున్న వ్యక్తివి నువ్వేనని తాటికొండ రాజయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత ద్రోహివి నువ్వు, దళితుల పాలిట రాబందు నువ్వు అని తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. టీడీపీలో, బీఆర్ఎస్ లో మంత్రి పదవులు అనుభవించి అక్రమ ఆస్తులు సంపాదించుకున్నావని అన్నారు. 1994లో నీ ఆస్తులు ఎన్ని.. ఇప్పుడు నీ ఆస్తులు ఎన్ని అని ప్రశ్నించారు. అవినీతితో సంపాదించుకున్న వాడు ఎవడైనా సాక్షాలు పెట్టుకుంటాడా.. నీ ఇల్లు, నీ పెట్రోల్ బంక్, నూరు భూములు, విదేశాలలో ఉన్న నీ ఆస్తులన్నీ సాక్ష్యం కాదా అని తాటికొండ రాజయ్య ఆరోపించారు.

# నటుడు అల్లు అర్జున్‌కు ఊరట

హైదరాబాద్: సినీనటుడు అల్లు అర్జున్ కు నాంపల్లి కోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. అల్లు అర్జున్ పిటిషన్‌పై ఇటీవల వాదనలు ముగియగా.. నాంపల్లి కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. రూ.50వేలు, రెండు పూచీకత్తులను సమర్పించాల్సిందిగా న్యాయస్థానం ఆదేశించింది.

'పుష్ప2' బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో అల్లు అర్జున్‌పై చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. నాంపల్లి కోర్టు రిమాండ్ విధించడంతో పోలీసులు ఆయన్ను జైలుకు తరలించారు. హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో అల్లు అర్జున్ విడుదలయ్యారు.మరోవైపు నాంపల్లి కోర్టు విధించిన రిమాండ్ ముగియడంతో ఆయన వర్చువల్‌గా విచారణకు హాజరయ్యారు. అదే రోజు అల్లు అర్జున్ తరఫు న్యాయవాదులు రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన నాంపల్లి కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది.

# గత పదేళ్లలో భ్రష్టుపట్టిన పరిపాలన

**హైదరాబాద్:** గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం పరిపాలన వ్యవస్థను భ్రష్టు పట్టించిందని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిపాలన వ్యవస్థను పునరుద్ధరించే ప్రయత్నం చేశామని ఉద్ఘాటించారు.. సచివాలయంలో తెలంగాణ

గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ 2025 డైరీ, క్యాలెండర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు హాజరయ్యారు. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు సీఎం తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం కష్టకాలంలో బాధ్యతలు చేపట్టిందని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కంటే ప్రత్యేక రాష్ట్రంలో మీరు ఎదుర్కొన్న ఇబ్బందులు అందరికీ తెలుసునని చెప్పారు. అలాంటి పరిస్థితుల్లో ఒక గొప్ప అవకాశం తమ ప్రభుత్వానికి ఇచ్చారని గుర్తుచేశారు. తాము అధికారంలోకి రాగానే తెలంగాణ ప్రజలకోసం పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతీ నెల మొదటి తేదీన జీతాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. తమ ప్రభుత్వంపై ఆధారపడి ప్రజల కోసం పనిచేసే వారికి ప్రతీ నెలా మొదటి తేదీనే జీతాలు ఇస్తున్నామన్నారు. అక్కడక్కడా కొన్ని సమస్యలు ఉన్నాయని అన్నారు. ఆర్థిక పరిస్థితుల వల్ల ప్రభుత్వానికి ఆదాయం లేకపోవడంతో కొన్ని సమస్యలను పరిష్కరించలేకపోతున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు.



'ప్రతీ నెల ప్రభుత్వానికి వచ్చే ఆదాయం రూ.18500 కోట్లు. ఇది ప్రభుత్వ అవసరాలకు సరిపోవడం లేదు. అన్నీ సక్రమంగా నిర్వహించాలంటే రూ.30వేల కోట్లు కావాలి. వచ్చే ఆదాయంలో రూ.6500కోట్లు ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర అవసరాలకు చెల్లిస్తున్నాం. మరో రూ. 6500 కోట్లు ప్రతీ నెల అప్పులు చెల్లించాల్సిన పరిస్థితి. మిగిలిన రూ. 5500 కోట్లలో సంక్షేమ పథకాలు అమలు చేయాల్సిన పరిస్థితి. కనీస అవసరాలకు ప్రతీ నెల రూ. 22500 కోట్లు కావాలి. వచ్చిన ఆదాయంతో పోలిస్తే రూ.4000 కోట్లు తక్కువ పడుతోంది. సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు చేర్చేది ఉద్యోగులే. మేము అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రాష్ట్రంలో సామాజిక మార్పును తీసుకొచ్చాం. ఆర్థికపరమైన మార్పులు తీసుకురావాలంటే ఇంకా కొంత సమయం పడుతుంది. రాష్ట్ర ఆదాయాన్ని పారదర్శకంగా ఖర్చు చేసేందుకు మీరు ఎలాంటి సలహాలు ఇచ్చినా తీసుకుంటాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 'ప్రభుత్వ ఆదాయం ప్రతీ నెలా మరో రూ.4000 కోట్లు పెంచుకోవాలి. సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారుడికి చేరేలా చర్యలు తీసుకోవాలి. ఈ ప్రభుత్వం మనది?ఆదాయాన్ని పెంచాలన్నా, పెంచిన ఆదాయం పంచాలన్నా మీ చేతుల్లోనే ఉంది. మీ సమస్యలు చెప్పండి? పరిష్కారానికి కార్యాచరణ చేపడతాం. ఈ ప్రభుత్వం మీ సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరిస్తుంది. సమస్యల పరిష్కారానికి మీరు ధర్నాలే చేయాల్సిన అవసరం లేదు. చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయి. రాజకీయాల కోసం కొందరు నిరసనలు, ధర్నాలకు ప్రేరేపిస్తున్నారు. వారి ఉచ్చులో పడితే చివరకు నష్టపోయేది మీరే. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని మాకు ఉన్నా చేయలేని పరిస్థితి. సర్వశిక్షా అభియాన్ కేంద్ర ప్రభుత్వ స్కీమ్. ఆ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే అవకాశం లేదు. నిబంధనలకు విరుద్ధంగా రెగ్యులరైజ్ చేస్తే న్యాయస్థానాల్లో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. అవకాశం లేకపోయినా రెగ్యులరైజ్ చేయాలని పట్టుబడితే సమస్య పెరుగుతుంది తప్ప పరిష్కారం కాదు. ప్రభుత్వ ఆదాయం పెంచుకునేం దుకు మీ సహకారం కావాలి. మీ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం. మిమ్మల్ని కష్టపెట్టి మీకు నష్టం కలిగే పనులు మా ప్రభుత్వం చేయదు' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టి జి ఓ అధ్యక్ష్యుడు ఏలూరి శ్రీనివాసరావు , టీజీఓ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ,సహ అధ్యక్ష్యుడు శ్యామ్ , రాష్ట్ర నేతలు ఉపేందర్ రెడ్డి, జగన్మోహన్ రావు, లక్ష్మణ్ గౌడ్, కృష్ణాయాదవ్, సహదేవ్

,రామకృష్ణ గౌడ్ ,దీపారెడ్డి,సుజాత ,పరమేశ్వర్ రెడ్డి ,అస్నాల శ్రీనివాస్ 33 జిల్లాల టీజీఓ అధ్యక్ష్య,కార్యదర్శులు పాల్గొన్నారు.

# నూతన 'ఉత్సాహంతో ఉత్తమ సేవలందించండి

**విజయవాడ:**నూతన సంవత్సరంలో మరింత ఉత్సాహంతో పనిచేసి జిల్లానుఅభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషిచేద్దామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు. పీ ఎన్‌జీజీవో ఎన్‌టీఆర్ జిల్లాశాఖ 2025 క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సమర్థవంతమైన సేవలందించ డంలో ఉద్యోగులది కీలకపాత్ర అన్నారు. ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిస్థాయిలో ప్రజలకు చేరువ చేయడంలో మరింత సమర్థవంతంగా పనిచేయాలన్నారు. అభివృద్ధిలో జిల్లాను నెం.1 స్థానంలో నిలిపేందుకు ఉద్యోగులు, అధికారుల సమష్టి కృషి అవసరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర అ 2047 దార్శనిక ప్రణాళికను విడుదల చేసిన నేపథ్యంలో ప్రణాళికలోని లక్ష్యాల సాధనలో ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. జిల్లా కార్యదర్శి డి.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాల్లో జిల్లాను అగ్రగామిగా నిలపడంలో, వివిధ కార్యక్రమాలను విజయవంతం చేయడంలోనూ జిల్లా ఉద్యోగులు ముందుంటారన్నారు. ప్రగతి విషయంలో జిల్లాను ఆదర్శంగా నిలిపేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక కార్యాచారణతో కృషిచేస్తున్నారని.. ఆయన సారథ్యంలో ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయడం జరుగుతోందన్నారు. ఞార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు పి.రమేష్, కోశాధికారి బి.సతీష్ కుమార్, కార్యవర్గ సభ్యులు వి.నాగార్జున, ఎం.రాజుబాబు, జి.రామకృష్ణ, ఆర్.శ్రీనివాస్, ఎం.గోపాలకృష్ణ, బీవీ రమణ, కె.శివలీల, నగర శాఖ కార్యవర్గ సభ్యులు సీవీఆర్ ప్రసాద్, ఎస్‌కే నజీరుద్దీన్, డీఎస్ఎన్ శ్రీనివాస్, పి.రాజశేఖర్, సీహెచ్ మధుసూధనరావు, ఎస్‌కే ఖాసిం సాహెబ్, వీవీ ప్రసాద్, టి.విద్యా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# కుంభమేళాలో వాతావరణ సమాచారం



## ప్రతి 15 నిముషాలకు మార్పులపై అలర్ట్

**ప్రయాగ్‌రాజ్:** కుంభమేళా నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్‌కు వచ్చే భక్తులు అక్కడి వాతావరణం గురించి తెలుసుకునేందుకు వాతావరణ శాఖ వెబ్‌సైట్‌లో ప్రత్యేక పేజీని పొందుపర్చామని ఐఎండీ డైరెక్టర్ మనీశ్ రణాల్కర్ తెలిపారు. ఈ వెబ్‌సైట్ ద్వారా ప్రతీ 15 నిమిషాలకు ఒకసారి వాతావరణంలో వచ్చే మార్పులను తెలుసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా రోజుకు రెండుసార్లు వాతావరణ సూచనలను అందులో జారీ చేస్తామని వెల్లడించారు. దీని కోసం కుంభమేళా నిర్వహించే ప్రాంతాన్ని తాత్కాలిక జిల్లాగా ప్రకటించామన్నారు. మహా కుంభమేళాకు ప్రయాగ్‌రాజ్ సిద్ధమవుతోంది. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు 45 రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవానికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు 40 కోట్ల మంది వస్తారని అంచనా. ఈనేపథ్యంలో అధికారులు పెద్దఎత్తున ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కాగా ఉత్తరాదిలోని పలు రాష్టాల్లో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయి మంచు దట్టంగా కురుస్తోంది. కుంభమేళా నిర్వహించనున్న ఉత్తరప్రదేశ్‌లోనూ ఇదే పరిస్థితి. దీంతో అధికారులు భక్తుల కోసం మరిన్ని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కుంభమేళాకు హాజరయ్యే భక్తుల అవసరాలు, భద్రత కోసం ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో పాల్గొనేవారి సంఖ్యను ఎప్పటికప్పుడు లెక్కించడంతోపాటు వారికి కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటుచేయడం కోసం

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నామని అధికారులు పేర్కొన్నారు. భక్తులకు తాత్కాలిక వసతి కల్పించేందుకు 1.6 లక్షల టెంట్లు, 1.5 లక్షల మరుగుదొడ్లు ఏర్పాటుచేస్తున్నట్లు వెల్లడించారు. భద్రత కోసం పారామిలటరీ బలగాలు సహా 50 వేల మంది సిబ్బంది ఆ ప్రాంతంలో మోహరించారని తెలిపారు.

# మొదలైన హైదరాబాద్ ఎగ్జిబిషన్

ఉంచింది. సీసీ కెమెరాలు, భద్రతా బలగాలతో పాటు.. సందర్శకులు మైదానంలో తిరిగేందుకు ఏర్పాట్లు చేశారు. జమ్మూకశ్మీర్ డ్రై ఫ్రూట్స్, హ్యాండ్ క్రాఫ్ట్స్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ నుంచి హస్తకళ వస్తువులు ప్రదర్శనలో ఉంటాయి. దేశంలోని అత్యుత్తమ బ్రాండ్ల ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు అన్ని రకాల స్టాల్స్ అందుబాటులో ఉంటాయి. రోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు, వారాంతాలు,

సెలవు రోజుల్లో రాత్రి 11 గంటల వరకు ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

## తెలంగాణలో పెరిగిన చలితీవ్రత
## ఆదిలాబాద్‌లో 7.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత

హైదరాబాద్: తెలంగాణలో రోజు రోజుకు చలి తీవ్రత పెరుగుతోందని వాతావరణ శాఖ వెల్లడించింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదు అవుతున్నట్లు తెలిపింది. రాష్ట్రంలో ఈశాన్య గాలులు చురుకుగా వీస్తుండటంతో



చలి తీవ్రత మరింత పెరిగిందని పేర్కొంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. ఆదిలాబాద్ జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 12.8 డిగ్రీల నుంచి 7.2 డిగ్రీలకు పడిపోయిందని తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాలకు రెండు రోజుల పాటు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఞాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా రెండు డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. అత్యంత కనిష్ఠంగా హెచ్‌సీయూలో 8.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బీహెచ్ఈఎల్ వద్ద 8.8, రాజేంద్రనగర్‌లో 9.4, మౌలాలీలో 9.6, శివరాంపల్లిలో 10.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. దీంతో ప్రజలు చలికి వణికిపోయారు. శుక్రవారం రాత్రి కూడా ఇలాగే ఉంటుందని, ఉష్ణోగ్రతలు అతి తక్కువకు పడిపోతాయని వాతావరణ శాఖ తెలిపింది.

# పేదలను మభయపెట్టి అవయవాల తస్కరణ

**గుంటూరు:** పేదలను మభ్యపెట్టి అవయవాలు తీసుకునే ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హెచ్చరించారు. అవయవ దానంపై మెడికల్ కళాశాల్లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. అవయవ దానంపై ప్రజల్లో అవగాహన తీసుకురావడం అభినందనీయమని ప్రశంసించారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో రోజుకు 5 బ్రెయిన్ డెడ్ కేసులు వస్తున్నాయని చెప్పారు. అవయవ దానం చేయడానికి ప్రజలు ముందుకు రావాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌ను ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ శుక్రవారం సందర్శించారు. ఈ సమయంలో మంత్రికు నిరసన సెగ తాకింది. మెడికల్ పీజీ కౌన్సెలింగ్‌లో అక్రమాలపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సెలింగ్‌లో లోపాలు మంత్రికి చెప్పుకునేందుకు తల్లిదండ్రులు వచ్చారు. సమస్య చెబుతున్న వినకుండా మంత్రి సత్య కుమార్ ముందుకు వెళ్లిపోయారు. మంత్రి సత్యకుమార్ తీరుపై తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేశారు. వైద్యశాఖ నిర్లక్ష్యంతో మెడికల్ విద్యార్థులు చాలా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ స్పందించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. అయితే మెడికల్ పీజీ కాలేజ్ కౌన్సెలింగ్ వివాదంపై మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పందించారు. జగన్ ప్రభుత్వం నిర్వాకం వల్లే మెడికల్ పీజీ కౌన్సెలింగ్‌లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కోర్టు తీర్పుల వల్లే పీజీ విద్యార్థులు ఇబ్బందులు ఏదుర్కొంటున్నారని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వేసిన కమిషన్ అనేక విషయాలను పరిగణనలోకి తీసుకోలేదన్నారు, శాస్త్రీయ అంశాలను కమిషన్ పరిగణనలోకి తీసుకోలేదని చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి మేలు జరుగుతుందో చూస్తామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అనేక సమస్యలు ఉన్నాయని అన్నారు. వైద్య శాఖలో ఖాళీలను భర్తీ చేసే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. అన్ని సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# రాబోయే ఐదేళ్లలో కాలుష్య రహిత నగరంగా ఢిల్లీ : నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ: రాబోయే ఐదేళ్లలో ఢిల్లీని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుతామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. దేశ రాజధాని రవాణా నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసేందుకు, కాలుష్యాన్ని తగ్గించేందుకు రూ.12,500కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించారు. గత నవంబర్ నుంచి ఢిల్లీలో కాలుష్య స్థాయి ఎక్కువగానే ఉన్నది. కాలుష్యాన్ని తగ్గించేందుకు పలు చర్యలు తీసుకోవడంతో పాటు ఢిల్లీలో బీఎస్-3 పెట్రోల్, బీఎస్-4 డీజిల్ కార్లను రెండుసార్లు నిషేధించారు. ఇటీవల గాలి నాణ్యత సూచీ 350 వరకు చేరింది. కమీషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్ 3 కింద ఆంక్షలు మళ్లీ తీసుసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా కార్లపై మరోసారి నిషేధం విధించే అవకాశం ఉంది. అయితే, ఢిల్లీలోని వాతావరణ కాలుష్యానికి కారణాల్లో వాహనాలు ఉద్గారాలు సైతం ఒకటి. ఢిల్లీ రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు, కాలుష్యాన్ని తగ్గించేందుకు రూ.12,500కోట్ల పెట్టుబడిని కేంద్రమంత్రి తెలిపారు. అదనంగా రూ.12500 కోట్ల సీఆర్ఐఎఫ్ ఫండ్‌ని సైతం ప్రకటించారు. ఢిల్లీలో కాలుష్యాన్ని తగ్గించడానికి రహదారుల మంత్రిత్వ శాఖ ఏయే ప్రాజెక్టులను ప్రారంభించబోతుందో ఆయన వివరించారు. వాయు కాలుష్యం, ట్రాఫిక్ జామ్‌లతో ఢిల్లీ ఇబ్బందులపడుతుందని.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఢిల్లీని ఆయా సమస్యల నుంచి గట్టెక్కించేందుకు ప్రాజెక్టులను ప్రారంభించిందన్నారు. ఢిల్లీలోకి ప్రవేశించే వాహనాల ఒత్తిడిని తగ్గించేందుకు కొత్త రోడ్డు ప్రాజెక్టులు ఎంతో దోహదపడుతాయన్నారు. కాలుష్యాన్ని క్లీన్ ఎనర్జీ ద్వారా తగ్గించనున్నట్లు పేర్కొన్నారు. ఢిల్లీ కాలుష్యంలో 40శాతం శిలాజ ఇంధనాల వినియోగమే కారణమని.. దాంతో ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సులు, కార్లు, స్కూటర్లు, సీఎన్‌జీ వాహనాలను తీసుకువచ్చామన్నారు. రాబోయే ఐదేళ్లలో ఢిల్లీని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

# 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యం

**విజయవాడ:** 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యం అని సిఎం చంద్రబాబునాయుడు పునరుద్ఘాటించారు. ఉమ్మడి రాష్ట్రంలో విజన్-2020 ప్రకటిస్తే చాలా మంది తప్పుబట్టారు. కానీ ఆ విజన్ ఫలితాలు ఇవాళ అందరికీ కనిపిస్తున్నాయి. ఇప్పుడు విజన్-2047 గురించి ఆలోచిస్తున్నాం. సంపద రావాలి.. ప్రజలు సంతోషంగా ఉండాలి. ఈ విషయంలో ముందుకు వెళ్లడమే తప్ప వెనకడుగు వేసేది లేదని స్పష్టం చేశారు. విజయవాడ పటమటలోని దత్త పీఠాన్ని సీఎం చంద్రబాబు సందర్శించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామితో చంద్రబాబు సమావేశమయ్యారు. సీఎంకు స్వాగతం పలికిన గణపతి సచ్చిదానంద స్వామి.. తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం రాష్ట్రంలోని 42 ప్రాంతాల్లో చేపట్టబోయే దత్త క్షేత్రనాథ్ యాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'స్వామిజీని దర్శించుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నా. సచ్చిదానంద స్వామిజీ ఆశీస్సులు తీసుకున్నా. సమాజహితం కోసమే సచ్చిదానంద పనిచేస్తున్నారు. నా కష్టాలు తొలగాలని పూజలు చేసి నాకు ప్రసాదం అందించారు. ఆధ్యాత్మిక భావన మనలో ఉండాలి. ఎప్పుడూ యథార్థాన్ని చెప్పే పరిస్థితిలో మనం ఉండాలి. భగవంతుడి ఆశీస్సులు కూడా తోడుగా ఉండాలి. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగాలి. పేదరికం పూర్తిగా పోవాలి. ప్రజలు సంతోషంగా ఉండాలని నేను కోరుకుంటున్నా. ఆ దిశగా కృషి చేస్తాం. ప్రజలు నాపై నమ్మకం పెట్టుకోవాలి.. రాష్టాన్ని స్వర్ణాంధ్ర వైపు తీసుకెళ్లే బాధ్యత నేను తీసుకుంటాను' అని చంద్రబాబు అన్నారు. గణపతి సచ్చిదానందస్వామి మాట్లాడుతూ.. 'కృష్ణానది ఒడ్డున జరిగిన సభను మర్చిపోలేను. చంద్రబాబు కర్మ యోగి.. ఆయన సంకల్పించిన పనులు నిర్విఘ్నంగా జరుగుతాయి. చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండటమే కాకుండా స్వర్ణాంధ్ర సాకారం కావడం తథ్యం. ఆయనకు కనకదుర్గమ్మ ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు.

# సావిత్రిబాయి పూలే కు న్యూడెమోక్రసీ ఘన నివాళి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 3:**

సావిత్రిబాయి పూలే 194వ జయంతి సందర్భంగా సిపిఐ ఎం ఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నగరంలోని సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి శుక్రవారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, భారతదేశంలో సావిత్రిబాయి పూలే మహిళలకు మొట్టమొదటిగా చదువు నేర్పించిందని, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పితృ సామ్యానికి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వ్యక్తి సావిత్రిబాయి పూలేనని అన్నారు. నేడు కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న



జంట లపై విపరీతమైన దాడులు పెరిగిపోయాయని, ఎడ్యుకేషన్ కూడా పూర్తిగా కాషాయికరించే న్యూ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకువచ్చిందని అన్నారు. దేశంలో దోపిడీ, అసమానతలు లేని సమాజం కోసం సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నాయకులు ఎం శివకుమార్, గొంట్యాల రమేష్, రాజు , పి.డి.ఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నరాపు రాజేశ్వర్, వీరయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# రోజులో పదిన్నర గంటలకుపైగా కూర్చొంటే మరణ ముప్పు!



రోజులో మరీ ఎక్కువ సమయం కూర్చొనే జీవన శైలి కలిగి ఉండటం ఆరోగ్యానికి హానికరమని ఎంఐటీ, హార్వర్డ్ యూనివర్సిటీలు చేసిన తాజా అధ్యయనం హెచ్చరించింది. ఒక రోజులో పదిన్నర గంటల కంటే ఎక్కువ సేపు కూర్చొంటే మరణానికి దారి తీసే గుండె వైఫల్యం తదితర హృద్రోగాలు పెరిగే ప్రమాదముందని తెలిపింది. హృద్రోగాల బారిన పడే అవకాశాలూ అధికమే

వాషింగ్టన్, డిసెంబర్ 31: రోజులో మరీ ఎక్కువ సమయం కూర్చొనే జీవన శైలి కలిగి ఉండటం ఆరోగ్యానికి హానికరమని ఎంఐటీ, హార్వర్డ్ యూనివర్సిటీలు చేసిన తాజా అధ్యయనం హెచ్చరించింది. ఒక రోజులో పదిన్నర గంటల కంటే ఎక్కువ సేపు కూర్చొంటే మరణానికి దారి తీసే గుండె వైఫల్యం తదితర హృద్రోగాలు పెరిగే ప్రమాదముందని తెలిపింది. అధ్యయనంలో భాగంగా సగటున 62 ఏండ్ల వయసున్న 89,530 మంది ఆరోగ్యాన్ని ఎనిమిదేండ్ల పాటు పరిశీలించారు.

వీరిలో రోజులో 10.6 గంటల కంటే ఎక్కువసేపు కూర్చున్నవారికి మిగతావారితో పోలిస్తే గుండె జబ్బుల ప్రమాదం ఎక్కువగా ఉందని గుర్తించారు. ఇలా ఎక్కువసేపు కూర్చొని పనిచేసేవారు క్రమం తప్పకుండా వ్యాయామం చేసినా వాటి ఫలితాలు వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచలేక పోయాయని అధ్యయనం తెలిపింది. క్రమం తప్పకుండా వ్యాయామం అలవాటున్న వారు రోజూ 10.6 గంటలకు పైగా కూర్చొంటే వారికి గుండె వైఫల్యం 15 శాతం, హృద్రోగాలతో మరణించే అవకాశం 33 శాతం ఎక్కువని వెల్లడించింది. వ్యాయామం అలవాటు లేని వారు రోజూ 10.6 గంటలకు పైగా కూర్చొంటే వారిలో హృద్రోగాలు, మరణ ముప్పు ప్రమాదం మరీ ఎక్కువని అధ్యయనం తేల్చింది.

# ఆలూరు పిఏసిఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ.

**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్ జనవరి 3:**

ఆలూర్ మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అద్వర్యంలో రూపొందించిన క్యాలెండర్ 2025 ను చైర్మన్ తంబుర్ శ్రీనివాస్ చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, సంఘం డైరెక్టర్లు కళ్ళెం భోజ రెడ్డి, కళ్ళెం సాయ రెడ్డి, బార్ల సంతోష్ రెడ్డి , ఇంగు గోవర్ధన్, సింగేడి మల్లు బాయి, ప్రమోదు కుమార్, అరే రాజేశ్వర్, వెల్మ నర్స రెడ్డి, పచ్చుక లసుం బాయి, కట్ట నర్సయ్య, గొల్ల గంగాధర్, సంఘం కార్యదర్శి తొర్తి మల్లేష్, సిబ్బంది ముత్యం, దేవ రాజ్, గంగాధర్, గంగారం, రైతులు పాల్గొన్నారు.



# అంటార్కిటికాపై రష్యా కన్ను



మంచు ఖండం అంటార్కిటికాపై రష్యా కన్నేసింది. అక్కడ నిక్షిప్తమై ఉన్న అపారమైన చమురు నిక్షేపాలను వెలికితీసి అంతర్జాతీయంగా తిరుగులేని శక్తిగా ఎదగాలని భావిస్తున్నది. ఇందుకోసం ఇప్పటికే ప్రయత్నాలను ప్రారంభించింది. రష్యా చర్యల పట్ల ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంచు ఖండం అంటార్కిటికాపై రష్యా కన్నేసింది. అక్కడ నిక్షిప్తమై ఉన్న అపారమైన చమురు నిక్షేపాలను వెలికితీసి అంతర్జాతీయంగా తిరుగులేని శక్తిగా ఎదగాలని భావిస్తున్నది. ఇందుకోసం ఇప్పటికే ప్రయత్నా లను ప్రారంభించింది. రష్యా చర్యల పట్ల ప్రపంచవ్యాప్తంగా పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రష్యా ప్రయత్నాలు ప్రపంచ దేశాల మధ్య వివాదానికీ కారణమయ్యే ప్రమాదం ఉంది. అంటార్కిటికాలో దాదాపు 51 వేల కోట్ల బ్యారెళ్ల చమురు నిక్షేపాలు ఉన్నాయని రష్యా జియాలజిస్టులు ఇప్పటికే గుర్తించారు. అయితే, చమురు నిక్షేపాలు గుర్తించిన ప్రాంతం తమదని యూకే ప్రకటించింది. యూకేతో పాటు రష్యా, చిలీ, అర్జెంటీనా వంటి ఏడు దేశాలు అంటార్కిటికాలో తమ భూభాగాలు ఉన్నాయని చెప్తున్నాయి. దీంతో ఇక్కడ చమురును వెలికితీసేందుకు రష్యా చేసే ప్రయత్నాలు ఈ దేశాల మధ్య వివాదంగా మారే అవకాశం ఉంది. చమురు రంగంలో శక్తిగా ఎదగాలనే..

ఒకవేళ ఈ చమురు నిక్షేపాలను కనుక వెలికితీస్తే ఒపెక్ దేశాలను దాటి చమురు రంగంలో ప్రధాన శక్తిగా రష్యా ఎదిగే అవకాశముంది.

# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 3:**

భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు మాత అన్ సావిత్రిబాయి పూలే 193వ జయంతిని పురస్కరించుకొని నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ, భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి




పూలే అని అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే ఇద్దరు కలిసి ఆ రోజుల్లో సత్యశోధక పాఠశాలలు ఏర్పాటు చేసి, మహిళలకు విద్యపై ఎంతో పోరాటం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ ప్రధాన కార్యదర్శి వసంతరావు, కోశాధికారి దీపక్, లైబ్రరీ సెక్రెటరీ పిల్లి శ్రీకాంత్, డాక్టర్ పులి జైపాల్, సి.హెచ్. రాజు, శీలం భాస్కర్, శేఖర్, సామ్రాట్, ఇందుమతి, అఖిల్, సురభి, అపూర్వ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ నెలకు సంబంధించిన వసూళ్ల విషయానికొస్తే..



తెలంగాణలో జీఎస్టీ వసూళ్ల వార్షిక ప్రాతిపదికన 10 శాతం వృద్ధి చెంది రూ.5,224 కోట్లకు పెరగగా.. ఆంధ్రప్రదేశ్‌లో వసూళ్లు 6 శాతం తగ్గి రూ.3,315 కోట్లకు పరిమితం అయ్యాయి. తెలంగాణతో పోలిస్తే ఏపీకి జీఎస్టీ వసూళ్లు తగ్గాయి. నవంబర్ నెలలో కూడా జీఎస్టీ వసూళ్లు తగ్గిన సంగతి తెలిసిందే.

ఆంధ్రప్రదేశ్ డిసెంబర్ నెల జీఎస్టీ వసూళ్ల లెక్కలు వచ్చాయి. కేంద్ర ఆర్థికశాఖ విడుదల చేసిన లెక్కల ప్రకారం.. 2023 డిసెంబర్‌తో 2024 డిసెంబర్ పోలిస్తే.. 6శాతం వసూళ్లు తగ్గాయి. తెలంగాణలో మాత్రం గతేడాదితో పోలిస్తే 10శాతం పెరిగాయి. ఆంధ్రప్రదేశ్ జీఎస్టీ వసూళ్లు రూ.3,545 కోట్ల నుంచి రూ.3,315 కోట్లకు తగ్గాయి. అదే తెలంగాణ జీఎస్టీ వసూళ్లు అయితే 2023 డిసెంబరుతో పోలిస్తే 2024 డిసెంబరులో రూ.4,753 కోట్ల నుంచి రూ.5,224 కోట్లకు పెరగడం విశేషం.

ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు వరకు ఎస్‌జీఎస్టీ, సీజీఎస్టీ, ఐజీఎస్టీ, సెస్‌ల రూపంలో ఆంధ్రప్రదేశ్‌లో రూ.33,371 కోట్లు, తెలంగాణ నుంచి రూ.46,289 కోట్లు వసూలు అయ్యింది. 2023తో పోల్చితే ఈ వసూళ్లు ఆంధ్రప్రదేశ్‌లో 1.3%, తెలంగాణలో 5.5% పెరిగినట్లు లెక్క. 2024 డిసెంబరులో ఎస్‌జీఎస్టీ సెటిల్‌మెంట్ తర్వాత ఏపీకి రూ.24,505 కోట్లు రాగా.. 2023 డిసెంబరులో వచ్చిన రూ.23,481 కోట్లతో పోల్చుకుంటే 4శాతం ఎక్కువ ఉంది. తెలంగాణ ఆదాయం రూ.29,889 కోట్ల నుంచి రూ.32,653 కోట్లు చేరింది.. ఇది 9శాతం పెరుగుదల. డిసెంబర్ నెల విషయానికి వస్తే.. దేశంలో అన్ని రాష్ట్రాల సగటు వసూళ్లు 8శాతం వృద్ధి నమోదు చేయగా.. ఆంధ్రప్రదేశ్ వృద్ధిరేటు ఒక్కటే మైనస్‌లో ఉంది. డిసెంబరు నెలలో జీఎస్టీ స్థూల వసూళ్లు రూ.1.77 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్ర ఆర్థికశాఖ తెలిపింది. 2023 డిసెంబరు నెలలో వసూలైన రూ.1.65 లక్షల కోట్లతో పోలిస్తే 7.3 శాతం రాబడి పెరిగింది. జీఎస్టీ వసూళ్లలో సెంట్రల్ జీఎస్టీ వాటా రూ.32,836 కోట్లు కాగా.. ఇంటిగ్రేటెడ్ జీఎసటీ రూ.47,783 కోట్లు, స్టేట్ జీఎస్టీ రూ.40,499 కోట్లు, సెస్సు రూ.11,471 కోట్లు. గత నెలలో దేశీయ లావాదేవీల ద్వారా జీఎస్టీ ఆదాయం 8.4 శాతం పెరిగి రూ.1.32 లక్షల కోట్లకు చేరింది.

# వెయిటింగ్‌లో ఉన్నవారికి పదోన్నతి

పీలో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లకు పదోన్నతులు దక్కాయి. ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన ఐదుగురు ఎస్పీ స్థాయి అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం డీఐజీలుగా ప్రమోషన్లు దక్కాయి. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే మరో ఐదుగురు ఐఏఎస్ అధికారులకు కూడా ప్రమోషన్‌లు వచ్చాయి. రెండు రోజుల క్రితం పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లకు పదోన్నుతులు దక్కాయి.. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో మరికొందరు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లకు ప్రమోషన్లు దక్కాయి. ఐదుగురు ఐఏఎస్ అధికారులకు, ఏడుగురు ఐపీఎస్ అధికారులకు పదోన్నతి దక్కింది. 2012 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారులు వి.ప్రసన్న వెంకటేష్, వి.విజయరామరాజు, ఎస్.నాగలక్ష్మి, మల్లికార్జున, ఎస్ మంజీర్ జిలానీలకు అదనపు కార్యదర్శులుగా పదోన్నతి పొందారు. ఈ మేరకు ప్రభుత్వం పదోన్నతులకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈ ఐఏఎస్‌లు అంతా జాయింట్ సెక్రటరీ కేడర్‌లో ఉన్నారు. ప్రస్తుతం బీసీ సంక్షేమ డైరెక్టర్‌గా మల్లికార్జున్, మార్క్‌ఫెడ్ ఎండీగా డా.మంజీర్ జిలానీ, సాంఘిక సంక్షేమ పాఠశాలల సెక్రటరీగా ప్రసన్న వెంకటేష్, పాఠశాల విద్య డైరెక్టర్‌గా వి.విజయరాజు, గుంటూరు కలెక్టర్‌గా ఎస్.నాగలక్ష్మి ఉన్నారు. వీరికి ప్రమోషన్లు దక్కినా సరే.. వీరంతా ఆ స్థానాల్లోనే కొనసాగనున్నారు.

ఐపీఎస్‌ల పదోన్నతుల విషయానికి వస్తే.. రవాణా శాఖ కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హాకు ప్రమోషన్ దక్కింది. ఐజీ ర్యాంక్ అధికారిగా ఉన్న మనీష్‌కుమార్ అడిషనల్ డీజీగా పదోన్నతి లభించింది. అలాగే డీఐజీ ర్యాంక్ అధికారి రాజకుమారికి ఐజీగా ప్రమోషన్ వచ్చింది. 2011 బ్యాచ్‌కు చెందిన ఐదుగురు ఐపీఎస్‌లకు సీనియర్ ఎస్పీ నుంచి డీఐజీలుగా పదోన్నతి దక్కింది. వీరిలో ఫకీరప్ప కాగినెల్లి, డీ సత్యఏసుబాబు, కేకేఎన్ అన్బురాజన్, సీహెచ్ వెంకటప్పలనాయుడు, బాబూజీ అట్టాడలకు డీఐజీల





ప్రమోషన్ వచ్చింది. వీరిలో వెంకటప్పలనాయుడు కేంద్ర సర్వీసులో డిప్యుటేషన్‌పై ఉండగా.. ఫక్కీరప్ప ఎస్ఐబీలో ఎస్పీగా పనిచేస్తున్నారు. సత్య ఏసుబాబు, కేకేఎన్ అన్బురాజన్, అట్టాడ బాబూజీలు ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నూతన సంవత్సరం తొలి రోజున కీలక ఫైల్‌పై సంతకం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 1,600 మందికి రూ.24 కోట్లు విడుదల కానున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు 9,123 మంది బాధితులకు రూ.124.16 కోట్ల సీఎంఆర్ఎఫ్ నిధుల్ని విడుదల చేశారు. అలాగే ముఖ్యమంత్రి అధికారిక నివాసంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రస్తుతం ఉంటున్న ఉండవల్లి నివాసాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (పొలిటికల్) సురేశ్‌కుమార్ నోటిఫికేషన్ జారీ చేశారు.

# చైనాతో తైవాన్ పునరేకీకరణను ఎవరూ అడ్డుకోలేరు

చైనాతో తైవాన్ పునరేకీకరణను ఎవరూ అడ్డుకోలేరని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ మంగళవారం ప్రకటించారు. 2.3 కోట్ల జనాభా గల తైవాన్ లోపలి, వెలుపలి స్వాతంత్ర్య అనుకూల శక్తులకు చైనా అధ్యక్షుడు తన నూతన సంవత్సర సందేశంలో గట్టి హెచ్చరికలు జారీచేశారు.





చైనాతో తైవాన్ పునరేకీకరణను ఎవరూ అడ్డుకోలేరని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ మంగళవారం ప్రకటించారు. 2.3 కోట్ల జనాభా గల తైవాన్ లోపలి, వెలుపలి స్వాతంత్ర్య అనుకూల శక్తులకు చైనా అధ్యక్షుడు తన నూతన సంవత్సర సందేశంలో గట్టి హెచ్చరికలు జారీచేశారు. చైనా గత సంవత్సరం దాదాపు ప్రతిరోజు తన యుద్ధనౌకలను, విమా నాలను తైవాన్ సమీపంలోకి పంపి సైనిక ఒత్తిడిని పెంచినట్టు వార్తలు వెలువడ్డాయి. ఈ చర్యలు తైవాన్‌లో తన సైనిక ఉనికిని సుస్థిరం చేసుకోవడానికి చైనా చేస్తున్న కుటిల ప్రయత్నంగా తైవాన్ ప్రభు త్వం ఇదివరకు ఆరోపించింది. ప్రజాస్వామిక పాలన గల తైవాన్ ద్వీపాన్ని తన సొంత భూభాగంగా చైనా పరిగణిస్తు న్నది. అయితే ఈ వాదనలను తైవాన్ బలంగా తోసిపుచ్చుతు న్నది. తైవాన్ ప్రజలు మాత్రమే తమ భవిష్యత్తును నిర్ణయించు కుంటారని, ఆ నిర్ణయాన్ని చైనా గౌరవించాల్సి ఉంటుందని తైవాన్ ప్రభుత్వం ప్రకటించింది.

# 4 రోజులకు అయ్యే ఖర్చు ఎంతో తెలిస్తే!

ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు బృందం ఈ నెల 20వ తేదీ నుంచి 4 రోజుల పాటు దావోస్?లో పర్యటించనుంది. స్విట్జర్లాండ్?లోని దావోస్?లో జరగనున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం 2025 సదస్సుకు సీఎం నేతృత్వంలోని ఏపీ టీమ్ హాజరు కానుంది. ఈ మేరకు ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదాన్ని తెలియచేసింది. జనవరి 20 నుంచి 24వ తేదీ వరకు జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు ఈ టీమ్ హాజరుకానుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున సీఎం, మంత్రుల సహా టీమ్ స్విట్జర్లాండ్‌లోని దావోస్ సదస్సుకు వెళుతోంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో దావోస్‌లో జనవరి 20 నుంచి నాలుగు రోజుల పాటు జరుగనున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం-2025 సదస్సుకు హాజరవుతారు. ఈ మేరకు ఏపీ నుంచి వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు ప్రతినిధుల బృందం హాజరయ్యేందుకు అవసరమైన ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దావోస్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున పెవిలియన్ ఏర్పాటుతో పాటుగా వసతి, ప్రయాణం ఖర్చుల కోసం ప్రభుత్వం రూ.15.98 కోట్లు పరిశ్రమల శాఖ నుంచి ఖర్చు చేయడానికి ప్రభుత్వం అనుమతించింది.

ఈ మేరకు ఈడీబీ (రాష్ట్ర ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు)ను నోడల్ ఏజెన్సీగా నియమించింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వీలుగా అన్ని శాఖలతో సంప్రదిం పులు జరపాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో తెలిపింది. గతంలోలాగా సీఐఐని భాగస్వామ్య సంస్థగా నియమించాలన్న ఈడీబీ ప్రతిపాదన కు ఆమోదం తెలిపింది. ఏపీ ప్రభుత్వం రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని.. దీని కోసం వరల్డ్ ఎకనమిక్ ఫోరంను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో మౌలిక రంగం, వ్యవసాయం, తయారీ, ఐటీ రంగాల్లో అవకాశాలు అందిపుచ్చుకో వాలని భావిస్తున్నారు. దావోస్‌లో జనవరి 20 నుంచి 24 వరకు జరిగే సదస్సుకు ముఖ్మయంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, పలువురు అధికారులు హాజరవుతారు. సీఎం టీమ్‌తో పాటుగా పరిశ్రమలు, ఏపీ ఎకనా మిక్ డెవలప్‌మెంట్ బోర్డు అధికారులు కూడా దావోస్ సదస్సుకు వెళతారు. దావోస్ సదస్సులో రాష్ట్రంలోని వనరులు, పెట్టుబడి అవకాశాలను సీఎం చంద్రబాబు, ఐటీ శాఖ

మంత్రి నారా లోకేష్ అండ్ టీమ్ వివరించనుంది. షేపింగ్ ది ఇంటెలి జెంట్ ఏజ్ అనే థీమ్‌తో ఏపీ ప్రభుత్వం పెవిలియన్ ఏర్పాటు చేయాలని నిర్ణయిం చింది. మరోవైపు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా దావోస్‌కు వెళుతున్న సంగతి తెలిసిందే..

# ఏడాదితో 7.3 శాతం వృద్ధి..!




డిసెంబర్ నెలలో జీఎస్టీ చెల్లింపులు రూ.1.77 లక్షల కోట్లకు చేరుకున్నాయి. వరుసగా పదో నెల జీఎస్టీ వసూళ్లు రూ.1.7 లక్షల కోట్ల మార్కును దాటాయని కేంద్ర ఆర్థికశాఖ వెల్లడించింది. డిసెంబర్ నెలలో జీఎస్టీ చెల్లింపులు రూ.1.77 లక్షల కోట్లకు చేరుకున్నాయి. వరుసగా పదో నెల జీఎస్టీ వసూళ్లు రూ.1.7 లక్షల కోట్ల మార్కును దాటాయని కేంద్ర ఆర్థికశాఖ వెల్లడించింది. 2023 డిసెంబర్ నెలతో పోలిస్తే గత నెలలో జీఎస్టీ వసూళ్లు 7.3 శాతం వృద్ధి చెందాయి. 2023 డిసెంబర్‌లో రూ.1.65 లక్షల కోట్ల వసూళ్లు జరిగాయి. కానీ, 2024 ఏప్రిల్‌లో జీఎస్టీ వసూళ్లు రూ.2.1 లక్షల కోట్లు, నవంబర్ వసూళ్లు రూ.1.82 లక్షల కోట్ల కంటే తక్కువే. ఏడాది ప్రాతిపదికన 8.5 శాతం జీఎస్టీ వసూళ్లు పెరిగాయి. దేశీయంగా జీఎస్టీ వసూళ్లు 8.4 శాతం పెరిగి రూ.1.32 లక్షల కోట్లు నమోదయ్యాయి. వస్తువుల దిగుమతిపై పన్ను ఆదాయం సుమారు నాలుగు శాతం పెరిగి రూ.44,268 కోట్లకు చేరుకున్నది. సెంట్రల్ జీఎస్టీ వసూళ్లు రూ.32,836 కోట్లు, స్టేట్ జీఎస్టీ వసూళ్లు రూ.40,499 కోట్లు, ఇంటిగ్రేటెడ్ ఐజీఎస్టీ వసూళ్లు రూ.47,783 కోట్లు, సెస్ రూ.11,471 కోట్లు వసూలు అయ్యాయి. అంతకు ముందు నవంబర్ నెలలో జీఎస్టీ వసూళ్లు రూ.1.81 లక్షల కోట్లు (8.5 శాతం వృద్ధి) నమోదైంది.

వేగుచుక్క

# ప్రభుత్వంపై తన "పోరాటం" వల్లే రూ" 60 కోట్ల నిధులు.




- **అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ వెల్లడి.**
- **కొడంగల్ కు ఇచ్చిన నిధుల్లో 25 శాతం నగర అభివృద్ధికి తేవాలని కాంగ్రెస్ నేతలకు సవాల్.**
- **కాంగ్రెస్ నాయకులకు పార్టీలకు అతీతంగా సన్మానం చేస్తాం అని వెల్లడి.**
- **కాంగ్రెస్ నాయకులు అవాస్తవ ప్రచారం మానుకోవాలని హితవు.**
- **కాంట్రాక్టర్ల బిల్లుల మంజూరుకి కమిషన్లు అడగటం సిగ్గు చేటన్నారు.**
- **అధికార పార్టీ ఎన్ని కుట్రలు చేసిన నిజామాబాద్ మేయర్ పీఠం బీజేపీదే నని వెల్లడి.**



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 3**

ప్రభుత్వంపై తన "పోరాటం" వల్లే రూ" 60 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ గుప్త అన్నారు. సిఎం కొడంగల్ కు ఇచ్చిన నిధుల్లో 25 శాతం నగర అభివృద్ధికి తేవాలని కాంగ్రెస్ నేతలకు సవాల్ విసిరారు. భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం సావిత్రి బాయ్ పూలే జయంతి సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అర్బన్ నియోజకవర్గం అభివృద్దే లక్ష్యంగా, నగరంలో ఆగిపోయిన పనులను ప్రారంభించే దిశగా, పెండింగ్ లో ఉన్న నిధుల మంజూరు కోసం నిరంతరం ప్రభుత్వంతో హక్కుగా కొట్లాడుతూ, సంబంధిత మంత్రులకు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోవడం జరుగుతుందని అన్నారు. అలాగే నియోజకవర్గం అభివృద్ధి పై ఎప్పటికప్పుడు ఇక్కడ జిల్లా అధికారులతో సమీక్షలు నిర్వహించి డివిజన్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని అన్నారు.

నియోజకవర్గానికి రావలిసిన టియుఎఫ్ ఐడిసి ఫండ్ 60 కోట్లు గత ప్రభుత్వం హయాంలో డివిజన్ కి కోటి రూపాయల చొప్పున మంజూరు చేయాగా, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వాటిని నిలిపేసి అభివృద్ధికి అడ్డుగా నిలిచింది వాస్తవం అని అన్నారు. తను ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుండి పెండింగ్ లో ఉన్న టియుఎఫ్ ఐడిసి ఫండ్ 60 కోట్ల బకాయి విడుదల చేయాలనీ ఇంచార్జ్ మంత్రి జూపల్లి, కలెక్టర్, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతే మన జిల్లాకు రావలిసిన ఫండ్ హక్కుగా కొట్లాడి తేవడం జరిగిందని అన్నారు. దానికి సంబందించిన జీఓ కాపీ, తను ప్రభుత్వానికి ఇచ్చిన లేఖను మీడియకి చూపడం జరిగింది. కానీ కాంగ్రెస్ నాయకులు ఏదో కొత్తగా, కొత్త సంవత్సరంకి బహుమతి ఇచ్చినం అని మతి లేని మాటలు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్ కు అపాయింట్మెంట్ లెటర్స్ ఇచ్చి 50వేల ఉద్యోగాలు ఇచ్చినం అని నిరుద్యోగులను మోసం చేస్తున్నారని, అసలు కాగ్రెస్ ఏడాది లో ఇస్తానన్న 2లక్షల ఉద్యోగాలు ఎక్కడపోయినాయి అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం చేత కాదు కాని ఎవరికో పుట్టిన బిడ్డ మాదే అని ఎత్తుకొని ముద్దాడటం బాగా వచ్చుని ఏద్దేవా చేసారు. స్పెషల్ ఫండ్ పేరుతో వచ్చిన 10 కోట్లు ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థి చేతుల పెడితే దానికి లెక్క లేదు పత్రం లేదన్నారు. ఎక్కడ అభివృద్ధి పనులకు వాటిని ఖర్చు చేసారో కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ నాయకులు చేసే కమిషన్ల దోపిడీకి కాంట్రాక్టర్లు ముందుకు వచ్చే పరిస్థితి లేదని, పెండింగ్ లో ఉన్న కాంట్రాక్టర్ల బిల్లులు మంజూరుకి కమిషన్లు కసరత్తులు చేస్తున్నారని అన్నారు. కమిషన్ల పైన ఉన్న శ్రద్ధ, రాష్ట్ర అభివృద్ధి పైన లేకపోవడం నిజంగా సిగ్గుచేటని పేర్కొన్నారు.

ఇందుర్ జిల్లాలో పేరుకే కాంగ్రెస్ నాయకులు పెద్ద పదవుల్లో ఉన్నారు కాని జిల్లా అభివృద్ధికి తెచ్చిన నిధులు సూన్యం అని అన్నారు.

పీసీసీ అధ్యక్షులు ఒకాయన, కామారెడ్డి లో చెల్లని రూపాయి ఇక్కడ ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థి ప్రభుత్వ సలహాదారుడు ఒకాయన, ఇద్దరు ఉన్న ఇందూర్ ను పట్టించుకునే సోయి లేదని మండిపడ్డారు నియోజకవర్గ అభివృద్ధికి పార్టీలకు అతీతంగా కలిసి రావడానికి తను సిద్ధంగా ఉన్నానని, కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి నియోజకవర్గనికి పోయిన నిధుల్లో కనీసం 25% తెచ్చే దమ్ము మీకు ఉందా అని సవాల్ చేసారు. కాంగ్రెస్ నాయకులు నిజంగా అలా నిధులు తెస్తే తను స్వయంగా కాంగ్రెస్ పెద్దలను బహిరంగ సభ పెట్టి సన్మానం చేస్తానని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పూలే దంపతుల పోరాటం స్ఫూర్తిదాయకం.





**అదనపు కలెక్టర్ అంకిత్.**

**కలెక్టరేట్లో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జనవరి 3 :**

ప్రముఖ సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను గురువారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ఘనంగా నిర్వహించారు. ప్రధాన సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి అదనపు కలెక్టర్ అంకిత్, ఇతర జిల్లా అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. అనేక ఆంక్షలతో కూడిన నాటి సమాజంలోనూ తన భర్త జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో సావిత్రిబాయి చదువు నేర్చుకుని ఉపాధ్యాయురాలు అయ్యారని గుర్తు చేశారు. విద్యను అభ్యసిస్తేనే స్త్రీ విముక్తి సాధ్యమవుతుందని గ్రహించిన సావిత్రిబాయి, సాటి మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో బాలికల పాఠశాలను ప్రారంభించి మహిళా చైతన్యానికి బాటలు వేశారని, తద్వారా ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా కీర్తి గడించారని అన్నారు. అస్పృశ్యత, అంటరానితనం, కులవివక్షత వంటి సామాజిక రుగ్మతలను నిర్మూలించేందుకు పూలే దంపతులు చేసిన పోరాటం, చూపిన తెగువ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆనాటి ఆధిపత్య వర్గాల సామాజిక కట్టుబాట్ల కారణంగా ఎన్ని అవాంతరాలు ఎదురైనా, వాటిని లెక్కచేయకుండా మహిళల విద్యాభివృద్ధికి అకుంఠిత దీక్షతో కృషి చేసిన ధీశాలి సావిత్రిబాయి పూలే అని ప్రశంసించారు. ఆ మహనీయురాలి స్ఫూర్తితో మహిళల అభ్యున్నతి కోసం కృషి చేయాలని, అప్పుడే ఆమె ఆశయ సాధనకు కృషి చేసినట్లు అవుతుందని అన్నారు. సావిత్రిబాయి సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఇకనుండి ఆమె జయంతిని పురస్కరించుకుని ప్రతియేటా జనవరి 3 వ తేదీన మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించాలని నిర్ణయించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయినులుగా ఎంపికైన సాలూర ఎం.ఈ.ఓ మంజూష, వేల్పూర్ ఎం.ఈ.ఓ రేణుక, సుద్దపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల పీ.డీ సంధ్యారాణి, నాగారం ఉర్దూ మీడియం రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన హలీమా బేగం, బాల్కొండలోని జ్యోతిబాపూలే బాలికల పాఠశాల ఉపాధ్యాయిని ఎల్.ఉమాదేవి, జూనియర్ లెక్చరర్ నూరున్నీసా బేగం, జాతీయ గ్రహీత విజయలక్ష్మి, రాష్ట్రస్థాయిలో అవార్డు పొందిన ఏ.స్వరూపలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా ఇన్ఫర్మేటిక్ ఆఫీసర్ మధు, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్ పాల్గొన్నారు.

## 7 న నిజామాబాద్ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశం.

**- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 3:**



ఈనెల 7 న నిజామాబాద్ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి తెలిపారు. డిచ్పల్లి గ్రామం కేఎన్ఆర్ గార్డెన్ లో నిర్వహించే సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్ దీప్ దాస్ మున్షీ, జిల్లా ఇన్చార్జి మినిస్టర్ జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి, బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, ఎంఎల్సీ జీవన్ రెడ్డి, రూరల్ ఎంఎల్ఏ భూపతి రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలోఎమ్మెల్యేగా పోటీ చేసిన అభ్యర్థులు, వివిధ రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్లు, పిసిసి డెలిగేట్స్, డిసిసి డెలిగేట్స్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మార్కెట్ కమిటీ చైర్మన్ లు, మున్సిపల్ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు పాల్గొంటారని తెలిపారు.

## సావిత్రి బాయి జీవిత చరిత్రను ఆదర్శం.

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**




**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, జనవరి 3:**

సావిత్రి బాయి జీవిత చరిత్ర ను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సావిత్రి బాయి పూలే జన్మదినం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం జనవరి 3 న మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా అధికారికంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని ఉత్తర్వులు జారీచేసింది, ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళల కోసం సావిత్రి బాయి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి మహిళలకు విద్యాబోధన చేయడం జరిగిందని తెలిపారు. తన భర్త జ్యోతిరావు పూలే సహకారంతో పాఠశాలలు ఏర్పాటు చేసి మహిళలకు విద్యాబోధన అందించడం జరిగిందని తెలిపారు. సావిత్రి బాయి నినాదర్శంగా తీసుకోవాలని అన్నారు. మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా సావిత్రి బాయి పనిచేశారని

తెలిపారు. వెనుకబడిన తరగతుల కోసం ఆమె ఎంతో కృషి చేశారని వివరించారు. అదనపు కలెక్టర్ వి.విక్టర్ మాట్లాడుతూ,సామాజిక సేవా కార్యక్రమాలను సావిత్రి బాయి నిర్వహించారని, పెద వర్గాలవారికి విద్యను అందించిన వ్యక్తి అని అన్నారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ, మహిళా ఉపాధ్యూరాళ్లను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్య శాఖాధికారి రాజు, వివిధ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రి బాయి పూలే ధీరత్వం ఆదర్శం.




**సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య.**

**వేగుచుక్క న్యూస్, సిరికొండ, జనవరి 3:**





సావిత్రి బాయి ధీరత్వం మహిళలందరికీ ఆదర్శం కావాలని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. స్త్రీల విద్యాభివృద్ధికి సాధికారతకు కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి, అట్టడుగు వర్గాల్లో విజ్ఞానాన్ని, చైతన్యం నింపడానికి సర్వస్వం త్యాగం చేసిన మహోన్నతమైన వ్యక్తి సావిత్రీబాయి పూలే అని పేర్కొన్నారు. భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలె 194వ జయంతి, మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని సత్యశోధక్ పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య పాఠశాల మహిళా ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి సావిత్రిబాయిపూలే చిత్ర పటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ, సామాజిక అసమానతలను రూపుమాపుటకు, మహిళా సాధికారతకు, హక్కుల సాధనకు భర్త మహాత్మ జ్యోతిరావు పూలేతో కలిసి విశేష కృషి చేసిన క్రాంతిరేఖ సావిత్రిబాయి పూలే అని అన్నారు. ప్రభుత్వం సావిత్రి భాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం హర్షనీయమన్నారు. మహనీయుల ఆశయాలు, లక్ష్యాలు నెరవేర్చడంలో ప్రతి ఒక్కరం భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.